క్లుప్తంగా

ఫీల్డ్ డే కార్యక్రమం



దుగ్గిరాల: ఏసెన్ అగ్రిసైన్సెస్ ప్రతినిధులు రేవేంద్రపాడులో సోమవారం ఫీల్డ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు కొప్పుల శ్రీనివాసరావు పొలంలో మొక్కజొన్న ఎ.హెచ్.సి 3318 రకాన్ని వారు పరిశీలించారు. శృంగారపురం, రేవేంద్రపాడు, చినపాలెం, పెదపాలెం నుంచి సుమారు 250 రైతులు కార్యక్రమానికి హాజరయ్యారు. 3ఎకరాలల్లో పంట సాగు చేశానని.. ఎకరాకు సుమారు 45 క్వింటాలు దిగుబడి వచ్చే అవకాశం ఉందని శ్రీనివాసరావు ఆశాభావం వ్యక్తం చేశారు. ఎఫ్.టి.ఇ శివగోపయ్య, రామకోటయ్య, శివ, మేనేజర్ హరీష్, సురేష్, ప్రముఖ శాస్త్రవేత్త అన్నుమన్ సింగ్ తదితర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రారంభమైన బాలల సమ్మర్ క్యాంప్



తాడేపల్లి రూరల్: అమరావతి ఐకాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మంగళగిరి, తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సమ్మర్ క్యాంప్ సోమవారం అమరావతి ఐకాన్‌లో బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు విజ్ఞానంతో పాటు వినోదం అవసరమని అన్నారు. సోమవారం నుంచి మే 12వ తేదీ వరకు ఈ సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు గణితంలో మెళకువలు.. 11 గంటల నుంచి 12 గంటల వరకు డాన్స్, జానపద నృత్యాలలో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. చిన్నారులకు ఇచ్చిన వేసవి సెలవులను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అమరావతి ఐకాన్ సభ్యులు వై.సుబ్బారావు, ముఖేష్, మనోహర్ రెడ్డి, డాన్స్ మాస్టర్ చందు, గణిత ఉపాధ్యాయులు లెనిన్ బాబు, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం వీవీప్యాడ్స్ పరిశీలన




ఫిరంగిపురం: మండలంలోని రేపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోడౌన్‌లో భద్రపరచిన ఈవీఎం వీవీప్యాడ్స్‌ను సాధారణ తనిఖీల్లో భాగంగా సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి షేక్.ఖాజావలి పరిశీలించారు. గోడౌన్‌లో భద్రత ప్రమాణాలు, సీసీ ఫుటేజ్, విద్యుత్ సరఫరా, ఇన్‌వర్టర్ పనితీరు పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఆర్అండ్‌బీ అప్పయ్య, అగ్నిమాపకశాఖ నాగరాజు, విద్యుత్‌శాఖ ఎల్ఐ వి.శివకుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



ఫిరంగిపురం: గర్భిణులు, బాలింతలు వేసవిలో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని వైద్యురాలు శాంతి అన్నారు. మండలంలోని తాళ్లూరు గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 168 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు వేసవిలో తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. తేలికపాటి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సాగర్‌రాణి, ఏఎస్ఎం సరోజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మతోన్మాద దాడులు అరికట్టాలి



తాడికొండ: మతోన్మాద దాడులను అరికట్టాలని సి.ఐ.టి.యు నాయకులు యడ్లపల్లి గాంధీ రామ్మోహనరావు, రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, పూర్ణచంద్రరావు అన్నారు. సోమవారం తాడికొండ, బందారుపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీలు సి.ఐ.టి.యు, రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మత సామరస్యాన్ని కాపాడాలంటూ మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పహల్గాం లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కఠిన చర్యలు అవసరమన్నారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సౌర విద్యుత్ కనెక్షన్‌ల వైపు మొగ్గు!

- 'సూర్యఘర్'తో పేదల ఇళ్లల్లో వెలుగులు
- సోలార్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీలు
- నియోజకవర్గంలో 26,796 కనెక్షన్‌లు మంజూరు



మేడపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్లు

ఈ పథకం కింద దరఖాస్తు చేసుకుని ప్రయోజనం పొందాలంటే తొలుత సూర్యఘర్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాలు నమోదు చేయాలి. 6 నెలల కరెంట్ బిల్లుల కాపీలు జత చేయాలి. తర్వాత రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి.

మంగళగిరి: మండుతున్న ఎండలకు జనం ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ప్రతి ఇంటా ఏసీ, ఫ్యాన్ 24 గంటలూ తిరగక తప్పడం లేదు. దీంతో కరెంటు బిల్లులు పెరిగిపోతున్నాయి. తాము అధికారంలోకి వస్తే కరెంట్ బిల్లులు పెంచబోమని ఎన్నికల హామీలో మాట ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన 10 నెలలకే మూడు సార్లు కరెంట్ బిల్లులు పెంచారు. దీంతో సామాన్యులు 'షాక్'కు గురై కరెంట్ బిల్లులు చెల్లించలేక ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన 'ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం' వైపు మొగ్గుచూపుతున్నారు. సౌర విద్యుత్ వినియోగించుకునే వారికి ప్రభుత్వం రాయితీలు సైతం ఇస్తుంది. దీంతో ప్రజలందరూ సౌర విద్యుత్ ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొస్తున్నారు.

విద్యుత్ ఛార్జీల భారం తగ్గించడానికి..

కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై విద్యుత్ ఛార్జీల భారం తగ్గించడానికి సూర్యఘర్ పథకం ప్రవేశపెట్టింది. సూర్యరశ్మి ఆధారంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకుని సోలార్ ద్వారా పొదుపు చేయడం దీని ఉద్దేశ్యం. ఈ పథకం కింద 300 యూనిట్లలోపు విద్యుత్ వాడకం ఉండాలనే నిబంధన ఉంది. సూర్యఘర్‌కు ట్రాన్స్‌కో అధికారుల అనుమతులు పొందిన తర్వాత వెండర్లను ఎంపిక చేసుకోవాలి. ఇందులో కిలో వ్యాట్‌కు నిర్ణయించిన ప్రకారం సబ్సిడీ ఇస్తారు. మిగిలిన మొత్తాన్నీ బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తారు. చివరగా ఇంటి పైభాగంపై వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వాడే మీటర్ల స్థానంలో నెట్ మీటర్లు ఏర్పాటు చేస్తారు. నెట్ మీటర్ బిగించిన తర్వాత పోర్టల్‌లో బ్యాంకు ఖాతా వివరాలు అప్‌లోడ్ చేయాలి. సబ్సిడీ మొత్తాన్నీ ప్రభుత్వం 30 రోజుల్లో చెల్లిస్తుంది.

పీఎం సూర్యఘర్ పథకం వివరాలు..

వినియోగం	సోలార్ కెపాసిటి(యూనిట్లలో)	సబ్సీడీ (కిలో వ్యాట్‌లో)
0–150	1–2	రూ.30 వేల నుంచి రూ.60 వేలు
150–300	2–3	రూ.50 వేల నుంచి రూ.78 వేలు
300పైన	3	రూ.78 వేలు

మంజూరు చేసిన కనెక్షన్ వివరాలు..

ఒక కిలో వ్యాట్ రూఫ్ కెపాసిటీ కోసం 3 నుంచి 4 ప్యానల్స్ (ఒక మీటరు వెడల్పు, 6 మీటర్ల ఎత్తు) అమర్చుతారు. కిలో వ్యాట్ సోలార్ రూటర్ ప్యానల్ నెలకు దాదాపు 125పైబడి యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో 1.47 లక్షల విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. ఇప్పటి వరకు 26,796 సౌర విద్యుత్ కనెక్షన్‌లు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు.

అవగాహన కల్పిస్తున్నాం..



వినియోగదారులు సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని చేసుకుని పొదుపు చేయడానికి సూర్యఘర్ మంచి పథకం. సోలార్ విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. రుణసదుపాయం కల్పిస్తుంది. 6 నుంచి 7 ఏళ్లల్లోనే పెట్టుబడి తిరిగి పొందవచ్చు. నెట్ మీటరు విధానం మూలంగా విద్యుత్ వాడకం తెలుసుకోవచ్చు. సందేహాలుంటే విద్యుత్ అధికారుల ద్వారా నివృత్తి చేసుకునే అవకాశం ఉంది. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– సురేష్ బాబు, విద్యుత్ శాఖ డీఈఈ

బీసీ నాయకుల అరెస్ట్ అప్రజాస్వామ్యం



సమావేశంలో మాట్లాడుతున్న మహేష్

మంగళగిరి టౌన్: బీసీ సంఘం నాయకుల్ని అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ఎన్.డి.ఎ కూటమి ప్రభుత్వాలు విజయవాడలో శాంతియుతంగా జరుగుతున్న ర్యాలీకి మద్దతుగా ముందుకు రాకపోగా పోలీసులను అడ్డుపెట్టి విఘాతం కలిగించడం సరికాదని అన్నారు. బీసీ ఉద్యమాలను పోలీసులతో అణచాలనుకుంటే అంతకు పదింతలు బలంగా బీసీల ఐక్యత ఉద్యమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. 2024 ఎన్నికల్లో కూటమికి బీసీలు మద్దతు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పోలీసులను కూటమి ప్రభుత్వం అదుపులో పెట్టుకోవాలని.. లేకుంటే పర్యవసానం తప్పదని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు, ఉపాధ్యక్షులు శివరాంప్ బాబాజీ, జిల్లా ఉపాధ్యక్షులు వరప్రసాద్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ ఫిల్మ్‌కు బహుమతి ప్రదానం



కొసరాజు కోటేశ్వరరావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గాదె నాగభూషణం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ ఉండవల్లికి చెందిన దర్శకుడు రూపొందించిన 'మా నాన్న పసివాడే' షార్ట్ ఫిల్మ్‌కు సోమవారం బహుమతి దక్కింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. డాక్టర్ కె.కె.ఆర్ వ్యాలీ వారు నిర్వహించిన షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్ 2025లో ఉండవల్లికి చెందిన గాదె నాగభూషణానికి గౌరవం దక్కిందన్నారు. తన రచన, దర్శకత్వంలో త్రినేత్ర ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో వృద్ధులను కుటుంబ సభ్యులు ప్రేమతో ఆదరించాలని.. ఎదిగిన పసివాళ్లగా ఇంట్లో వృద్ధులను చూడాలనే సందేశంతో రూపొందించిన 'మా నాన్న పసివాడే' షార్ట్ ఫిల్మ్ జ్యూరీ బహుమతిని గెలుచుకుందని తెలిపారు. షార్ట్ ఫిల్మ్ పోటీల నిర్వాహకులు కొసరాజు కోటేశ్వరరావు చేతుల మీదుగా షీల్డ్, సర్టిఫికేట్లు, రూ7 వేలు నగదు బహుమతిని తన టీమ్‌తో కలసి నాగభూషణం అందుకోవడం సంతోషకరమన్నారు. ఈశ్వరయ్య పాత్రలో జొన్న రామలింగేశ్వరరావు జీవించారని అన్నారు. ఈ సందర్భంగా ఉండవల్లి ప్రజలు నాగభూషణంను అభినందించారు.

మణిపాల్‌లో ఎక్మో సేవలు

తాడేపల్లి రూరల్: పట్టణ పరిధిలోని మహానాడు మణిపాల్ హాస్పటల్ నందు ఎక్మో సేవలు అందుబాటులోకి వచ్చాయని మణిపాల్ వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎక్స్ ట్రాకార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్ (ఎక్మో) ఒక కృత్రిమ గుండె–ఊపిరి తిత్తుల మెషిన్ అని.. ఇది రోగి అవయవాల పనిని తాత్కాలికంగా నిర్వహిస్తుందని అన్నారు. తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్య లేదా హార్ట్ ఫెయిల్యూర్ రోగుల్లో వెంటిలేటర్లు లేదా ఔషధాలు పనిచేయని స్థితిలో ఇది ఒక ఆధునిక ప్రాణ రక్షణగా నిలుస్తుందని తెలిపారు. యాక్యూట రెస్పిరేటరీ డిస్ట్రెస్ సింధ్రోమ్ (ఎఆర్‌డిఎస్), తీవ్రమైన న్యూమోనియా, పల్మనరీ ఎంబోలిజం, కార్డియాక్ సర్జరీకి సంబంధించి తీవ్రమైన రోగుల్లో ఎక్మో ఒక ప్రాణరక్షణగా నిలుస్తుందని వివరించారు. క్రిటికల్ కేర్ కన్సల్టెంట్ డాక్టర్ వి.దినేష్ కుమార్ మాట్లాడుతూ ఎక్మోలో ఆక్సిజన్ జనరేటర్, పంప్ అనే రెండు ప్రధాన భాగాలుంటాయని, ఆక్సిజనరేటర్ ఊపిరితిత్తుల్లో రక్తాన్ని శుద్ధి చేసే ప్రక్రియ నిర్వహిస్తుందని పేర్కొన్నారు.

అపరాల సాగుతో రైతులకు లాభాలు

దుగ్గిరాల: మొక్కజొన్న, తెల్లజొన్న అనంతరం బోర్లు ఉన్న రైతులు వేసవిలో అపరాల సాగు ద్వారా అధిక లాభాలు పొందవచ్చు అని ఎంఏఓ పి.శిరీష అన్నారు. దుగ్గిరాల వ్యవసాయ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పప్పు ధాన్యాలు వాతావరణంలో నత్రజనిని గ్రహించి నేలలో జమ చేస్తాయని.. దీంతో తరువాత వేసే పంటల పెరుగుదల బాగుంటుందని తెలిపారు. నేలలో సేంద్రియ కార్బన్ శాతం పెరుగుతుందని.. నేలలు సారవంతంగా మారతాయని.. నీటిని నిల్వ చేసే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. 50 శాతం సబ్సిడీపై అన్ని రైతు సేవా కేంద్రాల దగ్గర మినుము, పెసర, జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలను మే మొదటి వారంలో అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. కావాల్సిన రైతులు ఆర్.బి.కె ల వద్ద పొలం పాస్‌బుక్ తీసుకుని పేర్లు నమోదు చేయించుకోగలరని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బాధితురాలికి చెక్కు అందజేత

తాడేపల్లి రూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను తాడేపల్లి టి.డి.పి నాయకులు సోమవారం బాధితురాలికి అందజేశారు. తాడేపల్లి 14వ వార్డుకు చెందిన నేరిశెట్టి పద్మావతికి రూ.60 వేల ఎల్వోసీ చెక్కును అందజేశామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి ధార దాసు, మంగళగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బూదాల రవికుమార్, వల్లభాపురం పీటర్‌పాల్, మరియన్న, దేవ్వళ్ల ప్రసాద్, మంగళగిరి నియోజకవర్గ మహిళా కార్యదర్శి కల్యాణి పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలీ శాఖాగ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులలు భాగంగా 'చదవడం మాకిష్టం' కార్యకమ్రాన్ని నిర్వహించారు. గ్రంథాలయ ఇన్‌చార్జి పి.జేమ్స్ పలు రకాల పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. చదివే విధానాన్ని ఉపాధ్యాయుడు ఫ్రాన్సిస్ పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది దీవి.కృష్ణమూర్తులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలు నిలిపేయండంటూ ఫిర్యాదు



గ్రీవెన్స్‌లో అధికారులకు ఫిర్యాదు చేస్తున్న లాం గ్రామస్తులు

తాడికొండ: గ్రామంలో తాగేందుకు నీరు లేక 3 నెలల నుంచి నానా ఇబ్బందులు పడుతున్నామని.. తాగునీటి చెరువులో జరుగుతున్న అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని లాం గ్రామస్తులు గ్రీవెన్స్‌లో జిల్లా అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో టీడీపీ నాయకులు మట్టిదందా కోసం చెరువును ఎండగట్టి చేస్తున్న దోపిడీ కారణంగా చెరువు నీటి స్టోరేజీకి పనికి రాకుండా పోతుందని.. ఇప్పటికే పరిమితికి మించి తవ్వకాలు జరపడంతో గ్రావెల్ బయటపడుతుందని డీఆర్వో ఖాజావలికి వివరించారు. . కొన్నేళ్లుగా కొండ పోరంబోకులో ఇళ్లు నిర్మాణాలు చేసుకొని నివాసముంటున్న తమను రెగ్యులరైజ్ చేయాలని వాపోయారు. స్పందించిన డీఆర్వో తహసీల్దార్‌ను ఫోన్ ద్వారా సంప్రదించి అక్రమ తవ్వకాలు నిలిపివేయించి.. పేదల ఇళ్లను రెగ్యులరైజ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

న్యాయస్థానాల తీర్పులను అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా న్యాయస్థానాలు తీర్పులు ఇచ్చాయని.. వాటిని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అన్నారు. సోమవారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం దీక్షలు చేస్తున్నారని.. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని అన్నారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

కేంద్రం రాజధానికి నిధులు ఇస్తుందా!



లేఖలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లి రూరల్: మే 2వ తేదీన విభజన ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధి పనుల పునః ప్రారంభానికి వస్తున్న ప్రధాని మోడీ ఈసారైనా నిధులు ఇస్తారా.. అని సీపీఎం నాయకులు ప్రశ్నించారు. సోమవారం తాడేపల్లి పట్టణపరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో సీపీఎం రాష్ట్ర కమిటీ ప్రతిపాదించిన లేఖను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమరావతి రాజధానిలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 42 కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు కేటాయించినా నేటికీ ఎందుకు నిర్మాణాలు చేపట్టలేదని ప్రశ్నించారు. అప్పులతో రాష్ట్రం అభివృద్ధి కాదని.. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులు గ్రాంట్‌గా ఇవ్వాలని కోరుతున్నామన్నారు. గతంలో రాజధాని శంకుస్థాపనకు వచ్చిన ప్రధాని గుప్పెడు మట్టి, చెంబుడు నీళ్లు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు, నాయకులు జొన్న శివశంకరరావు, వేముల దుర్గారావు, దొంతిరెడ్డి వెంకట రెడ్డి, విజయ భాస్కరరెడ్డి, దర్శనపు విజయ్‌బాబు, రామారావు, దశరథ రామిరెడ్డి, గంజి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీకి బహిరంగ లేఖ



లేఖను విడుదల చేస్తున్న సీపీఎం రాజధాని నాయకులు

తాడేపల్లి రూరల్: భారత ప్రధాని నరేంద్ర మోడీ మే 2వ తేదీ అమరావతికి రానున్న సందర్భంగా సి.ఎం.పి రాజధాని నాయకులు సోమవారం బహిరంగ లేఖను ఉండవల్లి సీపీఎం కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ.. రాజధాని అభివృద్ధికి కేంద్రం నిధులు ఇస్తున్నట్లు మోడీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రపంచ బ్యాంక్, హడ్కో ద్వారా రాజధాని నిర్మాణానికి అప్పు ఇస్తామని చెప్పి కేంద్రం తప్పించుకోవాలని చూస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పు చేసి రాజధాని నిర్మాణాన్ని చేస్తే ఆ భారాన్ని తిరిగి రాష్ట్ర ప్రజలపై వేస్తుందని అన్నారు. అమరావతిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించిన స్థలాల్లో నిర్మాణాలు చేపట్టకుండా కాలయాపన చేశారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు ఎం.భాగ్యరాజు, టి.బక్కిరెడ్డి, ఎస్.ఇమ్మానియేల్, వల్లభాపురం వెంకటేశ్వరరావు, సుందరరావు, ఈమని రామారావు, రాఘవయ్య, నాగేశ్వరరావు, ఖాదర్ బాబా, పి.గాంధీ, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరారీలో నిందితులు

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల నరసరావుపేట రోడ్డులోని రైల్వే ట్రాక్ పక్కన ఉన్న తోటలో హత్యకు గురైన వ్యక్తి మంగళగిరికి చెందిన ఇట్ట బాలకృష్ణగా(40) పోలీసులు గుర్తించారు. హత్యకు గురైన వ్యక్తితో పాటు మరో ముగ్గురు 2019లో మేడికొండూరులో జరిగిన ఒక హత్య కేసులో నిందితులుగా ఉన్నట్లు గుర్తించారు. నలుగురు వ్యక్తులు మద్యం సేవించి తోటల్లో కూర్చున్నారు. మద్యం మత్తులో వారిలో వాదోపవాదన జరగడంతో ఈ హత్యకు దారి తీసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మంగళగిరికి చెందిన మాధవ, ఫిరంగిపురంకి చెందిన అశోకు, కె.శ్రీనులుగా పోలీసుల దర్యాప్తుల్లో వెల్లడయింది. పోలీసులు ప్రత్యేక దర్యాప్తును చేపట్టారు. నిందితులు పరారీలో ఉన్నారని అన్నారు.

నృత్య కళ.. అవార్డులు భళా!

నేడు అంతర్జాతీయ నృత్య దినోత్సవం



నృత్య భంగిమలో దీపాల కావేరి



అగ్నితో నృత్యం చేస్తున్న మధురిమ



నృత్యం చేస్తున్న బాలికలు

మంగళగిరి: బ్రేక్ డ్యాన్స్, లిల్లీ డ్యాన్స్‌లు అంటూ శాస్త్రీయ నృత్యాలైన కూచిపూడి, భరతనాట్యం, కథాకళి లాంటి నృత్యాలను నేడు యువత మరచిపోతోంది. శాస్త్రీయ నృత్యాలను నేటి తరాలకు అందించాలనే లక్ష్యంతో పట్టణంలో శారద సంగీత నృత్య కళాశాల కృషి చేస్తుంది. ఇందులో ఎంతో మంది విద్యార్థులు కూచిపూడి, భరతనాట్యం వంటి నృత్యాలు నేర్చుకుని అనేక ప్రోగామ్‌లు నిర్వహిస్తుండడం అభినందనీయం. మంగళవారం అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా నాట్య కళాకారులు తమ అనుభవాలను పంచుకుంటున్నారు. శారద సంగీత నృత్య కళాశాలలో నాట్యం నేర్చుకున్న దీపాల కావేరి నేడు అనేక సాంస్కృతిక కార్యక్రమాలలో కూచిపూడి, భరతనాట్యంలతో అనేక నృత్యాలు చేస్తుంది. కూచిపూడిలో ఎంఏ చేస్తున్న కావేరి అనేక ప్రదర్శనలలో రాణించి ఇటీవల ఎం.బి.ఆర్ హానోరరీ డాక్టరేట్ అవార్డుతో పాటు ఇన్‌స్పిరింగ్ ఉమెన్ అవార్డు –2025, స్టార్ అవార్డు సాధించింది. జి.మధురిమ ప్రత్యేక నృత్యాలతో ఆకట్టుకుంటుంది. రింగ్‌తో నృత్యం, నడుముకు రింగ్, తలపై అగ్గితో కూచిపూడి, భరతనాట్యం చేస్తూ ఆకట్టుకుంటుంది.

ఎన్నో ప్రదర్శనలు..

దేశ విదేశాలలో ఎన్నో ప్రదర్శనలు చేసి చాలా అవార్డులు సాధించిన సీలి వెంకట సుకన్య నృత్య కళాశాల ఏర్పాటు చేసి నృత్యకారులను ప్రోత్సహిస్తుంది. ఈ సందర్భంగా సుకన్య మాట్లాడుతూ.. భరతనాట్యంలో డిప్లోమా చేశానని.. నృత్య కళాశాల ఏర్పాటు చేసి నాట్యం నేర్పడమే నా కల అన్నారు. నృత్యంతో పాటు వైలన్, పియానోలోను శిక్షణ ఇస్తున్నారు. అంతరించిపోతున్న మన భారతీయ సంస్కృతిని వెలుగులోకి తేవడమే తన లక్ష్యమని తెలిపారు. మంగళగిరిలో ఇప్పుడు కూచిపూడి అంటే తెలియని వారు లేరని 10 మందితో మొదలైన స్కూలు నేడు 200 మందితో నడుస్తున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులను విస్మరించడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

మంగళగిరి టౌన్: నగరాలు, పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వాలు విస్మరించడం సరికాదని ఎ.ఐ.టి.యు.సి జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల సమస్యను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానం వల్ల కార్మికవర్గం తీవ్రంగా నష్టపోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి కార్మికుల హక్కులను కాలరాసే విధానాలను, చట్టాలను తీసుకువచ్చారని అన్నారు. కార్యక్రమంలో ఎ.పి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గారావు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బ్రహ్మేశ్వరరావు, నాయకులు వెంకటేశ్వరరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

మే డే కరపత్రాల ఆవిష్కరణ

తాడేపల్లి రూరల్: మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ ఆధ్వర్యంలో తాడేపల్లి నులకపేట ఆటో యూనియన్ కార్యాలయంలో మే డే కరపత్రాన్ని సంఘం నాయకులు సోమవారం ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షులు యస్.కె శ్రీను మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భారతదేశ కార్మిక వర్గాన్ని కక్షగట్టి మే డే అమరవీరుల స్ఫూర్తితో సాధించుకున్న కార్మికుల హక్కులను రద్దు చేస్తున్నారని విమర్శించారు. మే డే కార్యక్రమాలను చికాగో అమరవీరుల సాక్షిగా నిర్వహించనున్న జెండా ఆవిష్కరణలు, ర్యాలీలు, సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ కార్యదర్శి షేక్ సైదా, ఉపాధ్యక్షులు జాన్ సైదా, కోశాధికారి శ్రీను, గౌరవ అధ్యక్షులు కొండారెడ్డి వినయ్, రామారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పరికరాలు చోరీ

ఫిరంగిపురం: నిర్మాణ దశలో ఉన్న అపార్ట్‌మెంట్లో విద్యుత పరికరాలు చోరీకి గురైన సంఘటన ఫిరంగిపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక మార్నింగ్ స్టార్ కళాశాల ఎదురుగా నిర్మాణ దశలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్లో విలువైన విద్యుత్ వైర్లు, విద్యుత్ పరికరాలు చోరీకి గురయ్యాయి. వీటి విలువ సుమారు రూ.5 లక్షల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. దీనిపై సీసీ పుటేజీలో ముగ్గురు యువకుల కదలికలు రికార్డు అయ్యాయని.. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా కోట

ఫిరంగిపురం: మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా స్థానిక కోట వెంకట శేషారావును ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు సోమవారం తెలిపారు. స్థానిక రామాలయంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం ఎన్నికల నిర్వాహకులు పాల్గొని ఎన్నిక నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా వెంకట శేషారావును, కార్యదర్శిగా ఎస్.శివనాగ శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు నూతనంగా ఎన్నికైన వారిని సన్మానించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.